క్లుప్తంగా

పాఠశాలల పరిశీలన

సోమశిల : అనంతసాగరం మండలంలోని బొమ్మవరం, గుడిగుంట గ్రామాల్లోని పాఠశాలలను అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఉషారాణి మంగళవారం పరిశీలించారు. ఈ రెండు ప్రాథమిక పాఠశాలల్లో వర్షానికి స్లాబ్ నుంచి నీరు కారుతుండడంతో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించామన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవన నిర్మాణాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

• వరికుంటపాడు : వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ-2 సీహెచ్ రమణయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, పరిసరాలు, విద్యుత్, తాగునీటి వసతి తదితరాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలల్లోని వసతులు, సదుపాయాలను తనిఖీ చేసి నివేదికను అందజేస్తామన్నారు. హెచ్ఎం వీరభద్రయ్య ఉన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు రెండ్రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమైంది. 2030 నాటికి పేదరికం లేని మెరుగైన సమాజం, ఆరోగ్యకరమైన గ్రామం, పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడం, మౌలిక వసతుల కల్పన, బాలికలు, మహిళల సంరక్షణ, సుపరిపాలన, సామాజిక భద్రత అనే తొమ్మిది అంశాలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ



ఆత్మకూరు : రానున్న క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు పాస్టర్లకు నూతన దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు పి.ఎడ్వర్డ్ నేతృత్వంలో పట్టణంలోని సంస్థ కార్యాలయంలో వీటిని అందించారు. కార్యక్రమంలో పాస్టర్ సుధీర్‌బాబు, పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పండ్లు, రొట్టెల అందజేత

కావలి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో సౌతిండియా హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

పెన్షనర్లకు క్రీడా పోటీలు

కావలి : ఆలిండియా పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న క్రీడా మైదానంలో కావలి తాలూకా పెన్షనర్లకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల్లో సుమారు 80 మంది పెన్షనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్లలో ఉత్సాహాన్ని నింపేందుకు ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17న పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. సంఘ కార్యదర్శి దాచేపల్లి ఆదిశేషులు, సహాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి ఏపూరు వెంకయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాగులవెలటూరులో వైద్య శిబిరం



చేజర్ల : మండలంలోని నాగులవెలటూరు సచివాలయంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని, సుమారు 90 మంది రోగులను పరీక్షించారు. సీహెచ్ఓ మంజుల, హెచ్‌వీ లక్ష్మమ్మ, ఏఎన్ఎంలు సుజన, జబీన్, అరుణ, నీరజ, ప్రసన్న పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

అనుమసముద్రంపేట : మండలంలోని పెద్దబ్బీపురం ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. దాతల నుంచి సుమారు రూ.1.50 లక్షలను విరాళాలుగా సేకరించి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం సురేష్‌బాబు తెలిపారు. ఎంఈఓ డి.సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బైక్ చోరీ

ఉదయగిరి : స్థానిక బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాల ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. రామారావు అనే వ్యక్తి తన బైక్‌ను ప్రైవేటు వైద్యశాల ముందు పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంరక్షణ.. అభివృద్ధి

• వీఎస్ఎస్‌లతో అడవుల సంరక్షణ
• సాధారణ చెట్లతో పాటు జామాయిల్ పెంపకం
• వచ్చే ఆదాయంతో గ్రామాల అభివృద్ధి



మండలంలోని నాగులవెలటూరులో వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ చెట్లు

చేజర్ల : అడవుల సంరక్షణే ధ్యేయంగా గత ఐదేళ్లుగా విస్తృతంగా మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో వాటి బాధ్యతను వన సంరక్షణ సమితులకు(వీఎస్ఎస్) అప్పగించారు. అటవీ ప్రాంతంలో పెరుగుతున్న పలు రకాల చెట్లు స్మగ్లర్ల నుంచి కాపాడేందుకు అటవీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారు. కాగా రాపూరు రేంజ్ పరిధిలో దాదాపు నాలుగు మండలాలు ఉన్నాయి. అందులో చేజర్ల, కలువాయి పూర్తిగా ఉండగా పొదలకూరు, రాపూరు సగభాగం ఉన్నాయి. దాదాపు ఈ ప్రాంతంలో 52 వేల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి అటవీ ప్రాంతం పలుచబడడంతో సమీప గ్రామాల్లో వీఎస్ఎస్(వనసంరక్షణ సమితి)లను ఏర్పాటు చేసి కొత్తగా మొక్కలను పెంచుతున్నారు. ఇలా వీరు అడవుల్లో వేసిన జామాయిల్ కొన్ని సంవత్సరాల తర్వాత జిల్లా అటవీ శాఖ అధికారి ఆమోదంతో విక్రయిస్తుంటారు.

వీఎస్ఎస్‌ల పనులు

1996లో ప్రభుత్వం వీఎస్ఎస్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో సభ్యులుగా సమీప గ్రామాల అటవీ ప్రాంత ప్రజలను తీసుకుంటారు. వీరి ద్వారా మొక్కలను నాటించడం, వాటి పోషణ తదితర పనులను అటవీశాఖ సిబ్బంది చేయిస్తుంటారు. దీనికి గానూ వారికి కూలి నగదు చెల్లిస్తుంటారు. కాగా ఆదూరుపల్లి పరిధిలో ఎక్కువగా నేరేడు, ఉసిరి, మద్ది చెట్లను వేసి పెంచుతారు. ఖాళీగా ఉండే అటవీ ప్రాంతంలో జామాయిల్ మొక్కలను వేసి పెంచి అటవీ సిబ్బంది కాపాడుతారు. ఆదూరుపల్లి ఫారెస్ట్ ఠానా పరిధిలో నలుగురు బీట్ ఆఫీసర్లు ఈ వీఎస్ఎస్‌లను సంరక్షిస్తుంటారు.

వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు

అడవుల్లో వేసిన జామాయిల్ కొన్ని సంవత్సరాల తర్వాత జిల్లా అటవీ శాఖ అధికారి ఆమోదంతో విక్రయిస్తుంటారు. వచ్చిన ఆదాయంలో వీఎస్ఎస్‌లకు సగభాగం, కొంత ప్రభుత్వానికి, కొంత అడవుల్లోని మొక్కల సంరక్షణకు ఖర్చు చేస్తారు. వీఎస్ఎస్‌లు గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకుని వచ్చిన ఆదాయంతో అభివృద్ధి పనులు, కమ్యూనిటీ భవనాలు, స్వయం ఉపాధి కింద గొర్రెల పెంపకం వంటివి చేపడుతారు.

రేంజ్ పరిధిలో..

రాపూరు రేంజ్ పరిధిలో పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరులలో 15 వీఎస్ఎస్‌లు ఉన్నాయి. అందులో 626 హెక్టార్లలో జామాయిల్ పెంపకం చేపట్టారు. ఇటీవల కాలంలో జామాయిల్ అమ్మకాల వల్ల రూ.5,53,37,442 వచ్చింది. అందులో ప్రభుత్వానికి, వీఎస్ఎస్‌ల సభ్యులకు 50 శాతం వాటా అందించారు. వీఎస్ఎస్‌ల సంరక్షణకు, జామాయిల్ పెంపకం కోసం అటవీ శాఖ సుమారు రూ.2,08,09442 ఖర్చు చేసింది. రాబోయే రోజుల్లో వీఎస్ఎస్‌లను మరింతగా అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

కటింగ్ సమయంలో పని



అటవీ శాఖ పరిధిలోని జామాయిల్ మొక్కలను నాటడం, కటింగ్ సమయంలో మాత్రమే మాకు పని ఉంటుంది. నాగులవెలటూరు వన సంరక్షణ సమితిలో 150 మంది సభ్యులు ఉన్నారు. అప్పట్లో రూ.200 నుంచి రూ.250 కూలీ ఇచ్చేవారు. మూడు నెలలకోసారి మాత్రమే పని ఉంటుంది. ఇప్పుడు పనిచేస్తే రోజుకు రూ.400 కూలీ ఇస్తున్నారు.

– యు.మునలయ్య, వీఎస్ఎస్ చైర్మన్, నాగులవెలటూరు

పని కల్పిస్తే బాగుండు



వీఎస్ఎస్‌లో ఉన్న వారికి నెలలో కొన్ని రోజులైనా పని కల్పిస్తే బాగుంటుంది. జామాయిల్ మొక్కలను ఆరేళ్ల క్రితం వేశారు. ఇటీవల ఐదు నెలల క్రితం కటింగ్ చేశారు. అయితే వేసిన మొదట్లో బాగా పని ఉండేది. ఇటీవల నాలుగు నెలల క్రితం నాలుగు రోజులు పని కల్పించారు. రోజుకు రూ.400 ఇస్తామని చెప్పారు. ఇంత వరకు ఇవ్వలేదు. ఫారెస్ట్ అధికారిని అడిగితే జామాయిల్ కటింగ్ డబ్బులు వచ్చిన తర్వాత ఇస్తామని చెప్పారు.

– జి.సుబ్బమ్మ, వీఎస్ఎస్ వైస్ చైర్‌పర్సన్, నాగులవెలటూరు

సంరక్షించుకుంటాం

రాపూరు అటవీ రేంజ్ పరిధిలో ఉన్న అడవులతో పాటు వన సంరక్షణ సమితులను సంరక్షించుకుంటున్నాం. వీఎస్ఎస్‌లలో జామాయిల్ కటింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో వీఎస్ఎస్ సభ్యులకు సగం, ప్రభుత్వానికి సగం పంపుతాం.

– రవీంద్రబాబు, రాపూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

యువత క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు ప్రసంసా పత్రాలు, షీల్డ్ అందజేత

ఆత్మకూరు : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా నెహ్రూ యువ కేంద్రం మేనేజర్ ఎ.మహేంధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్రైడ్, హెడ్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలోని పలు కళాశాలల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, రన్నింగ్, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత తమ కళాశాలలకు, గ్రామాలకు మంచి పేరు తెచ్చేలా క్రీడల్లో రాణించాలన్నారు. డివిజన్ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్ఎం పెంచలయ్య, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ రియాజ్, ఎస్ఆర్‌జేడీ కళాశాల పీడీ ఎస్.వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వాగాల శ్రీహరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రానికి అనుమతి మంజూరు

అల్లూరు : అల్లూరులోని రామకృష్ణ పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రానికి అనుమతి మంజూరైందని ప్రిన్సిపల్ హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కళాశాలలో సిబ్బందితో కలిసి మాట్లాడారు. పీజీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనివర్సిటీ వీసీ దృష్టికి తీసుకెళ్లామని, ఈ మేరకు ఆయన ముందుగా జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలకు ఆదేశించినట్లు వివరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గంగిరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

దుస్తుల వితరణ



కావలి : తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారులకు రూరల్ కానిస్టేబుల్ అయోధ్య కుమార్ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. తన జన్మదినం సందర్భంగా సేవాసంస్థలోని చిన్నారులకు ఎస్సై సుమన్ చేతుల మీదుగా అందించారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన షేక్.ఖాదర్‌బాషాకు వైద్యఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్ర, కానిస్టేబుల్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

19 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉదయగిరి : స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్‌ల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 19 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. మొత్తం 41 మంది పాల్గొనగా హీరో మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్, అక్సిలెంట్ ఫార్మా సైన్స్, ఇన్ఫోస్ సోర్స్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 19 మందిని ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణస్వామి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

వరికుంటపాడు : మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈనెల 12, 13వ తేదీల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు మంగళవారం తెలిపారు. పంచాయతీల అభివృద్ధి, నిధుల లభ్యత, అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఉంటుందన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

• మంత్రి ఆనం



మర్రిపాడు : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఆనం

మర్రిపాడు : గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పొంగూరులో మంత్రి ఆనం ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 153 రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, సుమారు 500కు పైగా సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ కలెక్టర్ శీనానాయక్, ఆర్డీఓ పావని, తహసీల్దార్ అనిల్ పాల్గొన్నారు.

రాజముద్రతో పాసు పుస్తకాలు

ఆత్మకూరురూరల్ : ప్రభుత్వ రాజముద్రతో ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నాగులపాడులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన హాజరై, మాట్లాడారు. నాగులపాడు ప్రజల చిరకాల కోరికగా ఉన్న పంట కాలువపై బ్రిడ్జిని పూర్తి చేస్తామని తెలిపారు. మహిమలూరు పంచాయతీ కోటపాడు సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం దాత రసూల్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం, సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

• వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని రాగిపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం 23 అర్జీలు రాగా వీటిలో 20 వరకు భూమి మంజూరు కోసం వచ్చాయని తహసీల్దార్ హమీద్ తెలిపారు.

• సోమశిల : మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో రెవెన్యూ సదస్సు మంగళవారం జరిగింది. మొత్తం 23 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వై.సుభాషిణి తెలిపారు. సర్వేయర్ ముక్కు సురేష్, వీఆర్వో శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్ సాయి, వీఆర్ఏ రామయ్య ఉన్నారు.

• జలదంకి : మండలంలోని బీకే అగ్రహారం సచివాలయంలో తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం 26 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ శ్రీజ, దేవదాయశాఖ అధికారి బండి శాంతయ్య, వీఆర్వో తిరుపతయ్య పాల్గొన్నారు.

• అల్లూరు : మండల పరిధిలోని సింగపేట సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ లక్ష్మీనారాయణ రెవెన్యూ సమస్యల మీద అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ అశోక్, ఆర్ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.

• సంగం : మండలంలోని తలుపూరుపాడు పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ సోమ్లానాయక్ పలు భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

• చేజర్ల : మండలంలోని పాడేరులో జరిగిన రెవెన్యూ సదస్సుకు నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ మురళి మంగళవారం తెలిపారు. గ్రామంలో తొమ్మిదేళ్ల క్రితం చాలా మందికి పట్టాలు ఇచ్చారని, భూమి ఎక్కడ ఉందో చూపించలేదనే సమస్యపై ఒకటి, భూ సమస్యల పరిష్కారం కోసం రెండు అర్జీలు వచ్చాయన్నారు. వీటిని పరిష్కరిస్తామని తెలిపారు.

• ఉదయగిరి : మండలంలోని అప్పసముద్రం, దాసరపల్లి పంచాయతీల పరిధిలో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. వివిధ సమస్యలపై రైతులు 68 అర్జీలిచ్చారు. తహసీల్దార్ సుభద్ర, దేవదాయ శాఖ ఈఓ కవిత, ఆర్ఐ సురేంద్ర పాల్గొన్నారు.

• సీతారామపురం : మండలంలోని పబ్బులేటిపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 38 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే బుధవారం చిన్నాగంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

• వరికుంటపాడు : మండలంలోని గణేశ్వరపురం, నరసింహాపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ పి.హేమంత్‌కుమార్ పాల్గొని, అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలపై 74 వినతి పత్రాలు అందినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ యశ్వంత్‌కుమార్, వీఆర్వో ప్రసాద్, సర్వేయర్ విష్ణు పాల్గొన్నారు.

• అనుమసముద్రంపేట : మండలంలోని గుంపర్లపాడులో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వివిధ సమస్యలపై 32 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కలిగిరి: మినుము పంటను పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి



వరికుంటపాడు : రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానాధికారి జయశ్రీ

కలిగిరి : వరి, శనగ, మినుము, వేరుశనగ రైతులు తప్పనిసరిగా పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి పుట్టా సత్యవాణి తెలిపారు. చిన్నఅన్నలూరు రైతు సేవా కేంద్రం పరిధిలోని తూర్పు దూబగుంటలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరికి ఈ నెలాఖరు వరకు, మిగిలిన పంటలకు ఈనెల 15వ తేదీ వరకు బీమా చేయించుకునేందుకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామిరెడ్డి, డీఏఓ కార్యాలయ ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరిరావు, ఏఓ సురేష్ బాబు పాల్గొన్నారు.

• వరికుంటపాడు : మండలంలోని తోటల చెరువుపల్లి, జి.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ వి.రవికుమార్, ఉద్యానాధికారి జయశ్రీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను సందర్శించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫెంగల్ తుఫాన్ వల్ల కోత దశలోని పంటలు 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతింటే, ఆ వివరాలను సంబంధిత వ్యవసాయ సహాయకులకు ఈనెల 12వ తేదీలోపు సమర్పించాల్సిందిగా రైతులకు తెలియజేశారు.

• సీతారామపురం : తుఫాన్ కారణంగా పబ్బులేటిపల్లిలో దెబ్బతిన్న వరిపంటను ఏఓ చెన్నారెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం చిన్నాగంపల్లి, పబ్బులేటిపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, రైతులకు సూచనలు చేశారు. ఏఈఓ సాంబశివయ్య, వీఏఏ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు సిబ్బంది చిరంజీవి పాల్గొన్నారు.

• ఉదయగిరి : రైతులు యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ ఆంజనేయులునాయక్ తెలిపారు. మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరిపంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలిచ్చారు.

• మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి, నందవరం రైతు సేవా కేంద్రాల్లో మండల ఏఓ ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మినుము పంటను పరిశీలించారు. మినుములో బూడిద తెగులును గుర్తించి నివారణ చర్యలు సూచించారు. వీఏఏలు మల్లిక, కృష్ణవేణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్

ఉదయగిరి : ఉదయగిరి, వింజమూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ఆయా సబ్ డివిజన్ల డీఈలు కె.చంద్రమౌళి, రమణారావు తెలిపారు. స్థానిక కార్యాలయాలలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. గండిపాళెం జలాశయానికి సంబంధించి 17 డిస్ట్రిబ్యూటరీలు, ఉదయగిరి మండలంలో 11, సీతారామపురం మండలంలో 6 చెరువులకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

• సోమశిల : మండలంలోని అనంతసాగరం, ఇనగలూరు, లక్కరాజుపల్లి, చాపురాళ్లపల్లి గోరుకుంట్లవాగు, బొమ్మవరం, అప్పలాయగుంట, రేవూరు, కేతామన్నేరు, పడమటికంభంపాడు ప్రాదేశిక సంఘాలకు, సోమశిల ఉత్తరకాలువ డిస్ట్రిబ్యూటరీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లీలాకుమారి తెలిపారు.

బీజేపీ సమావేశం

కావలి : బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మంగళవారం కావలిలో నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి మధుకర్ పాల్గొని, మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్, కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

దుత్తలూరు : మండలంలో ఎక్కడైనా శ్మశాన స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని మందలనాయుడుపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని తెలపడంతో సర్వేయర్, వీఆర్వోలతో కలిసి శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారునికి నోటీసులిచ్చి ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

దుత్తలూరు: మోటార్‌బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలైన ఘటన సోమలరేగడ ఎస్సీ కాలనీ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఉదయగిరి మండలం దాసరపల్లికి చెందిన సానియా వేరొకరి బైక్‌పై దుత్తలూరు నుంచి ఉదయగిరి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో సోమలరేగడ ఎస్సీ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో సానియా గాయపడింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హక్కులపై అవగాహన ఉండాలి



అల్లూరు : అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీధర్



కావలి : మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

అల్లూరు : మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు స్పెషల్ జడ్జి శ్రీనివాసరావు, కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మానవ హక్కుల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగితే నేషనల్ హెచ్ఆర్సీ, స్టేట్ హెచ్ఆర్సీ కమిషన్లను సంప్రదించవచ్చని తెలిపారు. కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై కిశోర్‌బాబు, వీఐపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు షేక్ జంషీర్, జి.సతీష్‌కుమార్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి జి.చిన్నారావు, పి.సుధాకర్, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

• కావలి : పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో మానవ హక్కులపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, పాఠశాల హెచ్ఎం ద్వారకానాథ్ చౌదరిలు మాట్లాడుతూ జాతి, వర్ణ, వర్గ, లింగ వివక్షలకు తావులేకుండా మనుషులంతా సమానమే అనే భావన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, కల్యాణి, శ్రీనివాసులురెడ్డి, శ్రీహరి, షరీఫ్ పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవాలి



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

వరికుంటపాడు : గర్భిణులు రక్తహీనత లేకుండా తగిన పౌష్టికాహారం తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి కరీష్మా అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా ఆమె మంగళవారం 16 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం మాట్లాడుతూ అనవసరంగా స్కానింగ్ పరీక్షలు చేయించుకోవద్దన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాన్పులు ప్రభుత్వ వైద్యశాలల్లో చేయించుకోవాలన్నారు. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైలెవల్ కెనాల్ పూర్తికి చర్యలు

మర్రిపాడు: సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తిచేసి మర్రిపాడు మండలానికి సోమశిల జలాలు తీసుకువచ్చేందుకు ధృడసంకల్పంతో పని చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పొంగూరు రిజర్వాయర్‌ను రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంగళవారం మంత్రి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 2026 మార్చిలోగా హైలెవల్ కెనాల్ మొదటి విడత పనులను పూర్తి చేసి పడమటినాయుడుపల్లి, పొంగూరు, ఇసుకపల్లి, పెగళ్లపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేసి సోమశిల జలాలను తరలించేలా చర్యలు చేపట్టామన్నారు. రూ.1,680 కోట్లతో హైలెవల్ కెనాల్ ప్రాజెక్ట్ మంజూరు చేశారని, 60 శాతం పనులు పూర్తయ్యాయని, కొంత మేర భూసేకరణ కూడా జరిగిందన్నారు. సంక్రాంతి నుంచి పనులను పూర్తి స్థాయిలో మొదలు పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని మంత్రి స్పష్టం చేశారు. పొంగూరులో 1300 ఎకరాల మాత్రమే భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే చుక్కల భూములు, ఇతర భూ సమస్యలను పరిష్కరించి భూసేకరణ వేగవంతం చేస్తామన్నారు. వెలిగొండ రెండో టన్నెల్ కూడా పూర్తయితే ఉదయగిరి, ఆత్మకూరు పరిధిలో సుమారు 44 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని, ఈ రెండు ప్రాజెక్ట్‌లు పూర్తయితే మెట్ట ప్రాంత ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తొలిగి ఈ ప్రాంతం సస్యశ్యామలవుతుందన్నారు. తొలుత ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రి భూసేకరణ నిధులు విడుదల పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శీనానాయక్, ఇరిగేషన్ ఈఈలు శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వర్లు, డీఈ వెంకటేశ్వర్లు, రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.